క్లుప్తంగా

నాగలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ గణేష్



నగరం: మండలంలోని చిరకాలవారిపాలెం గ్రామానికి చెందిన చిరకాల నాగలక్ష్మి గురువారం అనారోగ్య కారణంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ నాగలక్ష్మి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్ కోటేశ్వరావు ఉన్నారు.

అద్దేపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

సర్పంచ్ దారా రవి కిరణ్మయి



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ఏరియాలో 1, 2 వార్డు ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించడమైనదని సర్పంచ్ దారా రవి కిరణ్మయి అన్నారు. సర్పంచ్ కిరణ్మయి మాట్లాడుతూ గురువారం 300 గృహాలు తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఆ సమస్యను తీర్చినట్లు తెలిపారు. ప్రజల ఇబ్బందులను ఆమె దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పోలీస్ స్టేషన్ వద్ద నుంచి పైప్ లైన్‌కు అద్దేపల్లి గిలకల బావి వద్ద కనెక్షన్ కలపడం జరిగిందని చెప్పారు. తాగునీటి కుళాయిలను విడుదల చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, ఒకటో వార్డు సభ్యురాలు కొలుసు శేషమ్మ, శ్రీనివాసరావు, దారా చెన్నయ్య, స్థానిక మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



చెరుకుపల్లి: విద్యార్థులను సహనంతో ఉపాధ్యాయులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఆర్.కవిత అన్నారు. మండల కేంద్రమైన చెరుకుపల్లి కొత్తపేటలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన వార్షిక వేడుకల్లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చేది పేద, మధ్య తరగతి విద్యార్థులేనని, వీరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దరి చేర్చటంతో పాటు నాణ్యత విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఓంకార సేవా సంస్థ అధ్యక్షుడు జి.సాంబశివరావు, ప్రధానోపాధ్యాయుడు అక్కల బాలాజీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ–4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. గురువారం కర్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న సర్వే కార్యక్రమాలను ఎంపీడీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వర్క్ ఫ్రమ్ హోమ్, క్యూఆర్ కోడ్, ప్రతి ఇంటినీ జియో ట్యాగింగ్ చేసే సర్వే కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే కచ్చితమైన సమాచారంతో చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కోర్టు తీర్పులను అమలు చేయాలి

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణతో కలసి ప్రారంభించారు. శివమ్మ, యహోషువా, అంకయ్య పాల్గొన్నారు.

పేదోడి ఫ్రిజ్‌ను కొనేవారేరి...?

- కుండలు కొనేవారులేక కుమ్మర్ల ఇబ్బందులు
- ఫ్రిజ్ వైపు మొగ్గుచూపుతున్న జనం
- ఉపాధి లేక కూలిపనులకు వెళ్తున్న వైనం



రోజుల తరబడి నిల్వ ఉండటంతో పగిలిపోతున్న మట్టికుండలు

బాపట్ల: ఆధునికత.. సంప్రదాయ వృత్తులను కబళిస్తుంది. కుల వృత్తులకు చరమగీతం పాడుతుంది. గృహోపకరణ వస్తువులు అందుబాటు ధరల్లో వాయిదాల పద్ధతిలో లభిస్తుండటంతో నేడు గ్రామీణ ప్రాంతాలు, పేదల ఇళ్లల్లో సైతం ఫ్రిజ్ సర్వసాధారణం అయిపోయింది. కాలం మారుతున్న కొద్దీ ప్రజలు ఎలక్ట్రానిక్ వస్తువులపై మోజు పడుతున్నారు. దీంతో కులవృత్తుల వారికి పనిలేకుండా పోయింది. విదేశాల నుంచి వస్తున్న ప్లాస్టిక్ వస్తువులు సైతం వీరిని ఇబ్బంది పెడుతూ ఉపాధి లేకుండా చేస్తున్నాయి. ఎండాకాలం మొదలైంది. అయినా కుండలు కొనేవారు లేక కుమ్మర్లు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

- ఈ ఏడాది ఎప్పుడూ లేనివిధంగా మార్చి నుంచే ఎండలు మండుతున్నాయి. అయినా చల్లని తాగునీటి కోసం కుండలు కొనేవారే కరువయ్యారు. కుండలు అమ్మే చిరు వ్యాపారులు రోజంతా ఎదురుచూసినా రెండు, మూడు కుండలకు మించి అమ్ముడుపోవడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా వేసవి కాలంలో చల్లని నీరు తాగేందుకు మట్టి కుండల వైపే ప్రజలు మొగ్గు చూపేవారు. దీంతో పేదవాడి ఫ్రిజ్‌గా చెప్పే కుండలకు డిమాండ్ ఉండేది. మారిన పరిస్థితుల నేపథ్యంలో ఫ్రిజ్‌లు రావడంతో మట్టి కుండలకు ఆదరణ కరువైంది. ఆరోగ్యం దృష్ట్యా ఫ్రిజ్ నీటి కన్నా కుండలో నీరు తాగడం మంచిదని వైద్యులు చెబుతున్నా.. సామాన్యులకు సైతం చెవికి ఎక్కడం లేదు. గతంలో ప్రతి గ్రామంలో కుమ్మర్లు మట్టితో కుండలు, దుత్తలు, హుండీలు, కూజాలు, ప్రమిదలు, పొయ్యిలు తయారుచేసి ఊరూరా విక్రయించేవారు. ప్రస్తుతం వాటికి కాలం చెల్లిపోయింది. వేసవిలోనూ కుండలను వినియోగించే వారు లేరు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో కుండల తయారీ వదులుకొని ప్రత్యామ్నాయ ఉపాధి చూసుకోవాల్సిందేనని కుమ్మర్లు వాపోతున్నారు.



కుండలు తయారుచేస్తున్న శ్రీశైలం మోహనరావు

గతంలో ప్రతి వంటకం మట్టి పాత్రలోనే వండేవారు. అన్నం వండి వార్చాలంటే జంగిడ అవసరం ఉండేది. మట్టి పాత్రల్లో వంటలు వండిన రోజుల్లో ప్రజలు ఆరోగ్యంగా ఉండేవారు. ఆధునీకరణ పెరగడంతో మట్టి పాత్రలకు కాలం చెల్లిపోయింది. వాటి స్థానంలో సిల్వర్, స్టీల్ పాత్రలు ప్రవేశించాయి. గతంలో కుమ్మరులకు చేతినిండా పని ఉండేది. శుభకార్యాల సమయంలో మట్టి పాత్రల వాడకం తప్పనిసరి. వీటి వాడకంపై రానురాను ప్రజల్లో ఆసక్తి తగ్గిపోతుంది. గతంలో కూజా రూ.10కే లభించగా ప్రస్తుతం రూ.120 నుంచి రూ.140 వరకు ధర పలుకుతుంది. గతంలో బాపట్ల పరిసర ప్రాంతాల్లో 30 కుటుంబాలకు పైగా కుండల తయారీలో తలమునకలై ఉండేవారు. ప్రస్తుతం వీటి వాడకం తగ్గిపోవడంతో కొన్ని కుటుంబాల వారు మాత్రమే ఈ వృత్తిలో కొనసాగుతున్నారు. వీరికి కూడా రాబడి అంతంత మాత్రంగా ఉండటంతో వీరి పిల్లలను వేరే వృత్తిలోకి పంపుతున్నారు.

కష్టపడినా ప్రయోజనం లేదు



కుండల తయారీకి పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ట్రాక్టర్ మట్టి కొనాలంటే రూ.4,500 చెల్లించాల్సి వస్తుంది. కుండలను కాల్చాలంటే అవసరమైన వంట చెరుకు కూడా దొరకడం లేదు. ఈ వృత్తిని విడిచిపెట్టలేకపోతున్నాం. మాకు ఈ పని తప్ప వేరేది రాదు. ఆధునిక కాలంలో వీటిని కొనేవారు తక్కువై పోయారు. ప్రభుత్వం ఆదుకోవాలి. రోజంతా అమ్మినా రూ.500 రావడం లేదు. గతేడాది వరకు చలి వేంద్రాల్లో మట్టి కుండలను వినియోగించేవారు. నేడు వాటర్‌క్యాన్‌లు, కూలింగ్ బాక్స్‌లను వినియోగిస్తూ మా పొట్ట కొడుతున్నారు. ఈ విషయంపై ప్రజలు ఆలోచించాలి.

– శ్రీకాకుళం మోహన్‌రావు, వెదుళ్ళపల్లి

విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలి

ముప్పలనేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని

బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఫార్మసీ కళాశాలలో హాస్టల్ డే సెలబ్రేషన్స్ ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పలనేని మాట్లాడుతూ నైతిక విలువలు పాటిస్తూ పూర్తి శక్తి సామర్థ్యాలతో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ సోషల్ మీడియా రాజ్యమేలుతున్న తరుణంలో విద్యార్థినులు సమయం వృథా చేసుకోకుండా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.ఈ.జి.కె.మూర్తి, డాక్టర్ వి.సాయి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలి

వేమూరు: పోలింగ్ స్టేషన్ బూత్ లెవల్ అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యనిర్వహణాధికారి జ్యోతిబసు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ బూత్ లెవల్ అధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించాలన్నారు. పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్లతో మంచిగా ఉండాలని తెలియజేశారు. బూత్ లెవల్ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సుశీల, చుండూరు తహసీల్దారు నాగరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె రూరల్: పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, మంచి నీటి కుళాయి చార్జీలను వారం రోజులలోపు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. నిర్దేశించిన గడువులోపు పన్నులు చెల్లించని వారి నీటి కుళాయి కనెక్షన్, విద్యుత్ కనెక్షన్‌లు ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే తొలగించటం జరుగుతుందని హెచ్చరించారు.

పాలిథిన్ నివారణకై కఠిన చర్యలు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా పట్టణంలో పాలిథిన్‌ను పూర్తిగా నిషేధించినట్లు కమిషనర్ సాంబశివరావు తెలిపారు. పాలిథిన్ కవర్లు విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాలిథిన్ వినియోగంతో కలిగే అనార్థాలపై పట్టణంలో అవగాహన ర్యాలీలు, సదస్సుల ద్వారా ప్రజలను ఇప్పటికే చైతన్యవంతం చేశామన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా సోమవారం నుంచి పట్టణంలోని దుకాణాలు, హోటళ్లు, పళ్లు, కూరగాయల మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలిథిన్‌ను నివారించి ప్రజలు సహకరించాలని కోరారు. వీటి స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకోవాలన్నారు.

చినపరిమిలో వైద్య శిబిరం



చుండూరు(వేమూరు): పేద ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు మెడికల్ క్యాంప్ నిర్వహించడం జరిగిందని వేటపాలెం మండల ప్రాథమిక వైద్యాధికారి కృష్ణవేణి అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో గురువారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. 168 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. థైరాయిడ్, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య సేవలు అందించడం జరిగిందన్నారు. ప్రతి గురువారం చినపరిమి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం చోరీ

చదలవాడ(వేమూరు): గుర్తు తెలియని వ్యక్తులు బంగారం చోరీ చేశారని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. వేమూరు మండలంలోని చదలవాడ గ్రామంలో చందు సుబ్బారావు ఇంటిలో దొంగలు పడి 10 సవర్ల బంగారం దొంగతనం చేయడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం సుబ్బారావు కుటుంబం పొలం పనులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలోకి వెళ్లి రెండు బీరువాలు పగలుగొట్టి బంగారం దొంగిలించడం జరిగిందని ఆయన తెలిపారు. బుధవారం సాయంత్రం ఫిర్యాదు చేశారని, గురువారం డాగ్ స్క్వాడ్ ద్వారా పరిశీలించడం జరిగిందని ఆయన తెలియజేశారు. త్వరలో దొంగతనం చేసిన వ్యక్తులను అరెస్ట్ చేస్తామని చెప్పారు.

కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ కృషి



మాట్లాడుతున్న కేబీ ప్రసాద్

తెనాలిఅర్బన్: కార్మికుల హక్కుల సాధనకు సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసి విజయం సాధించిదని జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ పేర్కొన్నారు. చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తెనాలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక నాయకులను అందరూ ఆదర్శంగా తీసుకుని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా పి.విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా టి.ఎలిజిబెత్, ఉపాధ్యక్షులుగా టి.రంగపుష్ప, ఎస్.ఆదిలక్ష్మి, కార్యదర్శులుగా పి.పావని, ఎల్.నిర్మలా జ్యోతి, ఎ.సునీత, కోశాధికారిగా షేక్ రజి యా బేగంలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ఏబీఎస్ కుమారి, సీఐటీయూ తెనాలి కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి, పాల్గొన్నారు.

విజయవాడ నుంచే హజ్ యాత్ర కొనసాగించాలి

దుగ్గిరాల: పవిత్ర హజ్ యాత్రకు విజయవాడ నుంచే హజ్ యాత్రను ప్రారంభించేలా చర్య లు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాల ముర్త జానగర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో హజ్ యాత్రకు వెళ్లేందుకు రాష్ట్రంలోని ముస్లింలు హైదరాబాద్, బెంగళూరు చేరుకోని ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేదన్నారు. ఆ విషయాన్ని అప్పటి మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి ముస్లిం పెద్దలు తీసుకెళ్లారని గుర్తుచేశారు. స్పందించిన ఆయన హజ్ యాత్రికుల సౌలభ్యం కొసం 2023 విజయవాడలో విమానాశ్రయం నుంచి ఎంబార్కే షన్ పాయింట్ ఏర్పాటు చేసి హజ్ యాత్రకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. టిక్కెట్టు ధర పెరగటం వల్ల ఒక్కో హజ్ యాత్రికునికి రూ.83 వేలు అదనపు భారం పడుతోందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భరించి హజ్ యాత్రికులకు ఆర్థికంగా అండగా నిలబడిందన్నారు.ప్రస్తుతం హజ్ కోసం విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ కొనసాగంచాలని డిమాండ్ చేశారు. యాత్రికులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేసి, అండగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ జాను సాహెబ్, షేక్ సమీ ఉల్లా పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఆమోదంపై హర్షం

తెనాలిఅర్బన్: ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడంపై టీడీపీ ఎస్సీసెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు సొపాటి కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకా కిరణ్ మాదిగలు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత లభించడాన్ని స్వాగతిస్తూ సొపాటి కిరణ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలోని మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద గురువారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. బి.ప్రసాద్, గాజులవర్తి సురేష్, కొక్కిలగడ్డ మనోజ్, తంగిరాల మనోజ్, బాలనాగమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు ప్రారంభం



బాపట్ల: బాపట్ల పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఏర్పాటు చేసిన వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ చికిత్సాలయాన్ని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం ప్రారంభించారు. బాపట్ల పశు వైద్యాధికారి బి.వేణుగోపాల్, స్నేహ యానిమల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వీధి కుక్కల బెడద తీర్చేందుకు కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. వీధి కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వాటి తెప్పించి శస్త్ర చికిత్స చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు ఉన్నారు.

వైఎస్సార్ పేరు.. చెరిపేస్తే చెరిగిపోయేది కాదు

రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు



భట్టిప్రోలు: విశాఖ ప్రగతికి రాచబాటలు వేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని కూటమి సర్కారు తీవ్రంగా అవమానించిందని రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు గురువారం ఒక ప్రకటనలో అన్నారు. ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ బ్రాండ్ ఉండకూడదని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ చనిపోయిన తర్వాత వైజాగ్‌లోని స్టేడియానికి వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రానికి చేసిన సేవకు గుర్తుగా తీర్మానం చేసి పేరు పెట్టారన్నారు. అధికారంలోకి రావడంతో నాగార్జున యూనివర్సిటీలో ఉన్న వైఎస్సార్ విగ్రహం, బాపట్ల జిల్లా భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లిలో విగ్రహాన్ని తగలబెట్టడం, తొలగించడం వంటి పనులు అసాంఘికమని అన్నారు. వైఎస్సార్ రాష్ట్రానికి అందించిన సేవలకు గుర్తుగా 2009 సెప్టెంబర్ 14న అప్పటి ఏసీఏ అధ్యక్షుడు గోకరాజు గంగరాజు ఆధ్వర్యంలో ఏసీఏ-వీడీసీఏ స్టేడియంకు వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంగా పేరు మార్చారని తెలిపారు. అప్పుడు అన్ని వర్గాల నుంచి మద్దతు లభించిందన్నారు. క్రికెట్ స్టేడియంకు వైఎస్సార్ పేరును తొలగించడం శోచనీయమని అన్నారు. కూటమి ప్రభుత్వం తీరుని నిరసించి వైజాగ్‌లో ధర్నా విజయవంతమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తొలగించిన పేరు యథావిధిగా పెట్టాలని డిమాండ్ చేశారు. వేమూరు నియోజకవర్గంలో 5 మండలాల్లో ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

గురుకుల పాఠశాల ప్రవేశానికై దరఖాస్తు చేసుకోవాలి

నిజాంపట్నం: మహాత్మ జ్యోతిబాపులే ఏపీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికై విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియన్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.నాగమల్లేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాంపట్నంలోని బాలుర పాఠశాల, కొత్తూరులోని బాలికల పాఠశాల, వేటపాలెంలోని బాలుర పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం ప్రవేశానికి, 6, 7, 8, 9 తరగతులలో మిగిలి ఉన్న ఖాళీ సీట్లను భర్తీకి, అదే విధంగా నిజాంపట్నంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిజాంపట్నం బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 40 సీట్లు, 6వ తరగతి 64, 7వ తరగతి 39, 8వ తరగతి 9, 9వ తరగతిలో 12, ఇంటర్మీడియెట్ ఎంపీసీ 60, బైపీసీ 40, సీఈసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. కొత్తూరు బాలికల పాఠశాలలో 5వ తరగతికి 40, 6వ తరగతి 21, 7వ తరగతి 2, 8వ తరగతి 2, 9వ తరగతి 3 సీట్లు, వేటపాలెం గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో 80, 6వ తరగతి 34, 7వ తరగతి 6, 8వ తరగతి 4, 9వ తరగతిలో 1 చొప్పున సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు త్వరితగతిన దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకై ఆయా పాఠశాలలు, కళాశాలల్లో సంప్రదించాలని కోరారు.

రహదారి ఇలా.. ప్రయాణం ఎలా..?



రావిఅనంతవరం గ్రామం వద్ద కరకట్ట రహదారిని కప్పివేసిన ముళ్ల చెట్లు

- ప్రాణ సంకటంగా కరకట్ట రహదారి
- రహదారిని కప్పేసిన ముళ్ల చెట్లు

రేపల్లె రూరల్: కరకట్ట రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. కరకట్టకు ఇరువైపులా దట్టంగా ముళ్ల చెట్లు పెరిగిపోవటంతో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని రావిఅనంతవరం గ్రామం నుంచి లంకెవానిదిబ్బ వరకు 30 కిలోమీటర్ల మేర గతంలో కరకట్ట రహదారిని నిర్మించారు. కరకట్ట పరిధిలోని గ్రామాల రైతులు తమ పొలాలకు, రొయ్యల చెరువులకు చేరుకోవాలంటే కరకట్ట రహదారిపై ప్రయాణించాల్సిందే. అదేవిధంగా రహదారి వెంబడి 7 నుంచి 10 పంచాయతీలు, చిన్న చిన్న కుగ్రామాలు 20 వరకు ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలంతా నిత్యం రేపల్లె రావాలంటే ఈ రహదారినే ఆశ్రయిస్తుంటారు. రాకపోకలు సాగించే సమయంలో రహదారి సక్రమంగా కనిపించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ సౌకర్యం సైతం లేకపోవటంతో ప్రయాణం నరక ప్రాయంగా మారుతోంది. రహదారికి ఇరువైపులా దట్టంగా పిచ్చి మొక్కలతో పాటు ముళ్ల చెట్లు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తోంది. దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కల నుంచి విషపురుగుల సంచారం అధికంగా ఉంటోందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పలుచోట్ల రహదారి వర్షాలకు కోతకుగురై గుంతలమయంగా మారింది. ఆదమరచి ప్రయాణం చేస్తే ముళ్ల చెట్లు తగిలి గాయాలపాలవ్వటంతో పాటు పక్కనే ఉన్న బ్యాంక్ కెనాల్‌లో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకంలోనైనా రహదారికి ఇరువైపులా కప్పివేసిన ముళ్ల చెట్లను తొలగించి రహదారిని అభివృద్ధి చేయాలని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆశలన్నీ జొన్నపైనే

- ఖరీఫ్ పైరు దెబ్బతినడంతో రబీగా చేపట్టిన మొక్కజొన్న
- ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతుకు లాభసాటి



కండె దశలో ఉన్న మొక్కజొన్న పైరు

తెనాలిటౌన్: ఆరుగాలం కష్టించే రైతన్నకు పండించిన పంట చేతికొచ్చి అమ్ముకునే దాకా గుండెల్లో రైలు పరిగెడతాయాంటే ఏ మాత్రం అతిశయోక్తి లేదు. తెనాలి ప్రాంతంలో ఖరీఫ్, రబీ పంటలు రైతన్నలు విస్తారంగా పండిస్తారు. అయితే ఇటీవల కాలంలో వరుసగా తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి ఉపద్రవాలు తలెత్తుతుండటంతో రైతన్నలకు పంట దిగుబడి తగ్గి అప్పుల పాలవుతున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభంలోనే వరుసగా రెండు తుఫాన్‌లు రావడంతో వరిసాగు భారీగా దెబ్బతిని రైతన్నలు అష్టకష్టాల పాలయ్యారు. తెనాలి ప్రాంతంలో కౌలు ఎకరాకు 20 నుంచి 26 బస్తాలు వసూలు చేస్తున్నారు. దీనికి తోడు పెట్టుబడి ఖర్చులు మోపెడు కావడంతో రైతన్నకు వ్యవసాయం భారంగా మారింది. ప్రస్తుతం

ఆశలన్నీ రబీ సాగు జొన్న, మొక్కజొన్న పైనే

తెనాలి నియోజకవర్గంలో మొక్కజొన్న 12567 ఎకరాల్లో పండిస్తుండగా, జొన్న 13371 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. కొల్లిపర మండలంలో జొన్న పైరు అధికంగా వేయగా, తెనాలి మండలం మొక్కజొన్న విస్తరంగా సాగు చేస్తున్నారు. జొన్న, మొక్కజొన్నకు పెట్టుబడి వ్యయం దాదాపు రూ.30,000 ల వరకు అవుతుందని రైతులు చెబుతున్నారు. దళారులు, ప్రవేట్ వ్యాపారులు రైతులకు ముందస్తుగా డబ్బులిచ్చి పంట అరకొర ధరతో కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటిస్తే దళారుల నుంచి రైతన్నలను రక్షించిన వారవుతారని కోరుతున్నారు. జొన్న, మొక్కజొన్న ఈ నెలాఖారు లేదా, ఏప్రిల్ మొదటి వారంలో పంట కోతకు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

చెక్కుల పంపిణీ

మంగళగిరి టౌన్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదు చెక్కులను గురువారం పలువురు బాధితులకు టీడీపీ నాయకులు అందజేశా రు. అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి పట్టణంలోని 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్నకుమార్‌కు రూ.8,41,988, 15వ వార్డుకు చెందిన మంచాల శ్యామ్‌సుందర్‌కు రూ.50, 891, 12వ వార్డుకు చెందిన మొహమ్మద్ సాధిక్ కు రూ.20,541, 9వ వార్డుకు చెందిన గంజి లీలకు రూ.1,00,290ల నగదు చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.